
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



పెన్షన్ సర్టిఫై చేసేందుకు లంచం

» రూ.20 వేలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన కైకలూరు సబ్ ట్రెజరీ ఉద్యోగి



కైకలూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగి పెన్షన్ సర్టిఫై చేసేందుకు సబ్ ట్రెజరీ ఉద్యోగి రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. శనివారం ఏసీబీ డీఎస్పీ వి.సుబ్బరాజు తెలిపిన వివరాల ప్రకారం తహసీల్దార్ కార్యాలయాల్లో అటెండర్‌గా పనిచేసి తొమ్మిదేళ్ల క్రితం కైకలూరుకు చెందిన షేక్ అబ్దుల్ సుబానీ రిటైర్ అయ్యారు. అప్పటి నుంచి కొన్ని సమస్యల వల్ల పెన్షన్ ఫిక్స్ కాలేదు. వాటిని అధిగమించి గత మార్చి నుంచి కైకలూరు సబ్‌ట్రెజరీ అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. సీనియర్ అకౌంటెంట్ కె.హనుమంతరావు (ఆంజనేయులు) గ్రాట్యుటీ అమౌంటు రూ.6 లక్షలు, తొమ్మిదేళ్ల నుంచి పెన్షన్ కలిపి రూ.33 లక్షలు వస్తుందని 2 శాతం చొప్పున రూ.66 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అంత ఇచ్చుకోలేనని సుబానీ చెప్పడంతో రూ.55 వేలు ఇచ్చేలా నిర్ణయించాడు. ముందుగా రూ.10 వేలు చెల్లించగా ఇటీవల పెన్షన్ ఫిక్స్ చేశాడు. గ్రాట్యుటీ సొమ్ము ఇప్పించాలని కోరగా ఇస్తానన్న సొమ్ములో కేవలం రూ.10 వేలే చెల్లించావని మిగతా రూ.45 వేలు బాకీ ఉన్నావన్నాడు. ప్రస్తుతం అంత చెల్లించుకోలేనని చెప్పడంతో ముందుగా రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో సుబానీ ఏలూరు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన అధికారులు రూ.20 వేలు కైకలూరు సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతనిపై కేసు నమోదు చేస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు. ఏలూరు, రాజమండ్రి ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు బాలకృష్ణ, శ్రీనివాసు, కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ నిట్.. సూపర్ హిట్



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఏపీ నిట్)లో సీట్ల కోసం డిమాండ్ ఏర్పడింది. దేశవ్యాప్తంగా జేఈఈలో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఈ సారి ఏపీ నిట్‌లో చేరుతున్నారు. గత ఏడాది సీఎస్ఈలో 10 వేల ర్యాంక్ నుంచి అడ్మిషన్లు ప్రారంభమైతే.. ఈ ఏడాది తొమ్మిది వేల ర్యాంక్ నుంచే అడ్మిషన్లు తీసుకున్నారు. వాస్తవానికి 750 సీట్లకు చేరిన నిట్ ఫ్యాకల్టీ లేదని, హాస్టల్ సౌకర్యం తక్కువగా ఉందంటూ 480 సీట్లకే పరిమితం చేసేశారు. రెగ్యులర్ డైరెక్టర్ నియామకం జాప్యంతో కేంద్రం నుంచి నిధులు మంజూరులోనూ వెనుకబడింది. రూ.400 కోట్లతో అభివృద్ధికి పంపించిన పెండింగ్‌లో ఉన్నాయి. బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ నియామకం చేపట్టలేకపోతున్నారు. ఇన్‌చార్జ్ డైరెక్టర్ నిట్‌ను సందర్శించడం గగనమైంది. సాధారణ పాలనాపరమైన అంశాలకే ఇన్‌ఛార్జ్ డైరెక్టర్ పరిమితమవుతున్నారు. దీనివల్ల నిట్ పురోగతి మందగిస్తోంది. డైరెక్టర్ నియామకం జరిగితే నిట్ మళ్లీ గాడిన పడుతుంది. సీట్ల సంఖ్య పెరుగుతుంది. ఒక దశలో ఏపీ నిట్ దక్షిణాదిలోనే నెంబర్-1 విద్యా సంస్థ అవార్డుకు ఎంపికైంది. అటువంటిది ఇప్పుడు సీట్లు కుదించే పరిస్థితికి వచ్చేసింది. అయినా సరే ప్లేస్‌మెంట్స్‌లో తన స్థానాన్ని పదిలపరచుకుంటూ వస్తోంది. నిట్‌లో అన్ని వసతులు బాగున్నాయంటూ విద్యార్థులు సంతృప్తి చెందుతున్నారు. డైరెక్టర్ లేకపోవడం ఒక్కటే సమస్యగా ఉందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. డైరెక్టర్ ఉంటే మంచి కంపెనీలను రప్పించి ప్లేస్‌మెంట్స్ కోసం మరింత కృషిచేస్తారు. కంపెనీలు ఆసక్తి చూపుతాయి. డైరెక్టర్ లేకపోవడంతో అంతర్జాతీయ స్థాయిలో పేరు పొందిన కంపెనీలు రావడం లేదు. ప్లేస్‌మెంట్స్‌లో ప్యాకేజీలు తగ్గిపోతున్నాయి.

దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆసక్తి

» 480 సీట్లకు అడ్మిషన్‌లు.. 455 మందికి కేటాయింపు
» ఆరో విడత కౌన్సెలింగ్‌లో మరికొందరు చేరే అవకాశం
» తదుపరి స్పాట్ కౌన్సెలింగ్ నాటికి మొత్తం సీట్లు భర్తీ
» సీఎస్ఈలో గత ఏడాది పది వేల ర్యాంకుతో ప్రారంభం
» ఈ ఏడాది తొమ్మిది వేల నుంచే..

ఫ్రీజింగ్ చేసుకుంటున్న విద్యార్థులు

దేశంలో ఐఐటీ, నిట్ సంస్థల్లో జోసా కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్‌లు కల్పిస్తారు. జేఈఈ మెయిన్స్‌లో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నిట్‌లో సీట్లు లభిస్తాయి. ఇప్పటి వరకు ఈ ఏడాది ఐదు విడతల కౌన్సెలింగ్ పూర్తయ్యింది. నిట్‌లో 455 మంది అభ్యర్థులు తమ సీట్లను ఫ్రీజ్ చేసుకున్నారు. మరో 25 సీట్ల కోసం ఆరో రౌండ్‌లో విద్యార్థులు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇక్కడ ఎంపిక చేసుకున్న విద్యార్థులు తమకు అనువైన నిట్‌లో సీట్లు వేస్తే అక్కడ ఫ్రీజ్ చేసుకుంటారు. లేదంటే నిట్‌కే పరిమితమవుతారు. ఇతర నిట్‌లలో సీటు కోసం ఎంపికైన విద్యార్థులు నిట్ తమకు అనుకూలమని భావిస్తే ఆరో రౌండ్‌లో ఫ్రీజ్ చేసుకునే అవకాశం ఉంది. అప్పటికీ నిట్‌లో సీట్లు మిగిలితే జోసా కౌన్సెలింగ్ ద్వారానే రెండు రౌండ్‌లు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. స్పాట్ కౌన్సెలింగ్ తర్వాత సీట్లు మిగిలే అవకాశం లేదు. గతంలో స్పాట్ కౌన్సెలింగ్ లేకపోవడంతో సీట్లు భర్తీ కాలేదు. ఐఐటీ సంస్థల్లోనూ ఇదే పరిస్థితి. దీంతో స్పాట్ కౌన్సెలింగ్ అమలు చేస్తున్నారు. ఫలితంగా ఐఐటీ, నిట్ సంస్థల్లో వంద శాతం సీట్లు భర్తీ అవుతున్నాయి. నిట్‌కు ఈ ఏడాది విద్యార్థుల నుంచి మంచి స్పందన ఉంటోంది.

పాలకొల్లుదే తొలి అడుగు



భీమవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు'లో పాలకొల్లు రికార్డు సాధించింది. మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో ఏ కార్యక్రమం చేపట్టినా 'ఎ' గ్రేడ్‌లో నిలుస్తూ వస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆయన తనదైన శైలిలో ముందడుగు వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రథమంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నెల రోజులపాటు నిర్వహించాలని చంద్రబాబు నిర్దేశించారు. నియోజకవర్గాల వారీగా లక్ష్యాలను ఇచ్చారు. ఈ కార్యక్రమాలు అన్నిచోట్లా జరుగుతున్నాయి. పాలకొల్లులో మాత్రం నిమ్మల ప్రణాళికాబద్ధంగా అడుగులు వేశారు. పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశారు. గ్రామాలు, పట్టణాల్లో వార్డుల వారీగా కేడర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ మాసాంతానికి లక్ష్యాన్ని చేరుకోవాలి. కాని, పాలకొల్లులో 12 రోజులు ముందుగానే వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేశారు. ఇక్కడ లక్ష్యం 64,104 ఇళ్లు కాగా, కేడర్ 70,005 ఇళ్లను సందర్శించి కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను, అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

రెండేళ్లలో వాటర్ గ్రిడ్

మేఘా సంస్థకు నిర్మాణ బాధ్యతలు
విజ్జేశ్వరం నుంచి జిల్లాలో 1,930 కిలోమీటర్ల మేర మెయిన్ పైపులైన్లు



» గ్రామాల్లో ఓహెచ్‌ఎస్‌ఆర్‌లు, సంప్‌లు, పైప్‌లైన్లు.. 40 వేల కుళాయి కనెక్షన్లు

ఎన్నో ఏళ్లుగా వాయిదాలు పడుతూ వస్తున్న స్వచ్ఛమైన తాగునీటి కల త్వరలోనే నెరవేరనుంది. జిల్లా అంతటా కలుషితం లేని తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసే వాటర్ గ్రిడ్‌కు సర్వంసిద్ధమైంది. గ్రిడ్ నిర్మాణ పనులకు మేఘా ఇంజనీరింగ్ కంపెనీతో ఒప్పందం కుదిరింది. రూ.1400 కోట్లతో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్ట్‌కు నిర్మాణ సమయం రెండేళ్లు. ఈ కాలంలో పనులు వేగంగా పుంజుకుని పూర్తయితే.. జిల్లావాసులకు తాగునీటి సమస్య తీరనుంది.

(భీమవరం రూరల్-ఆంధ్రజ్యోతి)

విజ్జేశ్వరం వద్ద వాటర్‌గ్రిడ్ చేయనున్నారు. దీనికి సంబంధించిన స్థలాన్ని సేకరించనున్నారు. అక్కడి నుంచి రెండు ప్రధాన పైపులైన్లు జిల్లా అంతటా వేయనున్నారు. మొదటి పైపులైన్ పెనుగొండ, పోడూరు, పాలకొల్లు, నరసాపురం మీదుగా మొగల్తూరు వెళుతుంది. రెండోది తణుకు, అత్తిలి, పాలకోడేరు మీదుగా భీమవరం వస్తుంది. ఈ రెండు ప్రధాన పైప్‌లైన్ల దూరం 1,930 కిలోమీటర్లు.

తాగునీటి స్టోరేజ్‌కు అన్ని ఏర్పాట్లు

వాటర్‌గ్రిడ్ ద్వారా వచ్చిన నీటిని గ్రామాల్లో స్టోరేజ్ చేయడానికి అవసరమైన నిర్మాణాలు చేపట్టనున్నారు. మంచినీటి పథకాలకు సంబంధించి 323 చెరువులు ఉన్నాయి. 988 ఓహెచ్ ఎస్ఆర్‌లు, 45 బీఆర్ ఓహెచ్‌ఎస్ఆర్‌లు, 55 సంప్‌లు ఏర్పాటు చేయనున్నారు. గ్రామాల్లో 730 కి.మీ. పైప్‌లైన్లు అమరుస్తారు. వీటితో పాటు 40 వేల కొత్త కుళాయి కనెక్షన్లు ఇస్తారు. గ్రామాల్లో ప్రతి మనిషికి 55 లీటర్ల నీటిని అందించనున్నారు.

జనాభాకు తగ్గ ఓహెచ్‌ఎస్ఆర్‌లు లేవు

గ్రామాల్లో రెండు దశాబ్దాల ముందే మంచినీటి పథకాలు ఏర్పడ్డాయి. అప్పటి జనాభా ప్రాతిపదికన మంచినీటి పథకాలను నిర్మించారు. ఓవర్ హెడ్ స్టోరేజీ రిజర్వాయర్(ఓహెచ్‌ఎస్ఆర్) అప్పటి జనాభాను బట్టి నీటి నిల్వ ట్యాంకులు కట్టారు. ఇప్పుడు రెండింతలు జనాభా పెరిగారు. అందు వల్ల ఎక్కువ గ్రామాల్లో నీటి నిల్వ ఉండే ఓహెచ్ఆర్ నిర్మిస్తారు.

తాగునీటి వల్లే అనారోగ్యాలు

తాగునీటి కాలువల్లోకి మురుగునీరు చేరుతోంది. ప్రజలు వ్యర్థ పదార్థాలను కాల్వల్లోకే వదిలేస్తున్నారు. కాలువ చివరకు వచ్చేసరికి నీళ్లన్నీ విషతుల్యంగా మారుతున్నాయి. అది మంచినీటి చెరువులోకి పెట్టినా కలుషిత నీరే తాగాల్సిన పరిస్థితి. అందువల్ల వాటర్ గ్రిడ్ ఏర్పాటు వల్ల గ్రామాలకు స్వచ్ఛమైన నీరు అందుతుంది.

- రామారావు, భీమవరం

వైసీపీ హయాంలో కదలని పనులు

జిల్లాకు వాటర్ గ్రిడ్ ఏర్పాటు 2022 ఫిబ్రవరిలో మంజూరుచేశారు. అదే ఏడాది నవంబరులో అప్పటి ముఖ్యమంత్రి నరసాపురంలో శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ప్రాజెక్ట్ ఆవగింజంత కూడా కదలలేదు. కూటమి ప్రభుత్వం మేఘా ఇంజనీరింగ్ కంపెనీతో ఈ ఏడాది మార్చి 25న ఒప్పందం కుదుర్చుకుంది. ఆ సమయం నుంచి రెండేళ్లలో ప్రాజెక్ట్ పూర్తి చేయాలని ప్రభుత్వం ఒప్పందంలో నిర్ణయించింది. దీంతో 2027 నాటికి పూర్తి చేసేలా పనులు చేపట్టనున్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాభివృద్ధి

» కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ
» బీజేపీ జిల్లా కార్యవర్గం ప్రకటన



భీమవరం టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ పాలన వల్లే అభివృద్ధి సంక్షేమ పథకాలు వేగంగా అమలవుతున్నాయి. ప్రధాని మోదీ రాష్ట్రాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తున్నారు' అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. శనివారం భీమవరంలోని బీజేపీ నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన పార్టీ జిల్లా పదాధికారుల సమావేశం అనంతరం, జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి 21 మందితో కూడిన జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు నూతన కమిటీ సభ్యులు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోదావరి జోనల్ ఇన్‌చార్జ్ కాశీ రాజు, మధుకర్ జీ, ఎంపీ పాకా సత్యనారాయణ, సుభాష్‌రాజు, నార్ని తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గం

జిల్లా ఉపాధ్యక్షులుగా పులపర్తి వెంకటేశ్వర్లు, బాలుసు మాధవిలత, యర్రంశెట్టి పద్మారావు, సేలం లక్ష్మీపార్వతి, కాగిత సురేంద్ర, కోరా రామమూర్తి, ఇంజేటి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా కురెళ్ళ నరసింహారావు, జనరల్ సెక్రటరీలుగా తోట గంగారాజు, దత్తు ప్రసాద్, కలిదిండి వినోద్‌వర్మ, కార్యదర్శులుగా ఆకుల లీలాకృష్ణ, నడిపూడి పెద్దిరాజు, అలుగు ప్రమీల రాణి, వనమా శ్రీనివాసు, కె.భారతి, రామదేవి ఎంపికయ్యారు.

బదిలీలపై మళ్లీ భగ్గు !

» సచివాలయ ఏఎన్‌ఎంల బదిలీలపై ఫిర్యాదులు -7లో



స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి సూర్యకుమారి, చిత్రంలో కలెక్టర్ నాగరాణి

ప్లాస్టిక్ వినియోగం తగ్గాలి

తణుకు రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించాలి. ప్లాస్టిక్ లంచ్ బాక్స్, వాటర్ బాటిల్స్ స్థానంలో స్టీల్ బాక్స్‌లు, బాటిల్స్‌ను ఉపయోగించాలి. మానవాళి మనుగడకు ప్లాస్టిక్‌ను నిర్మూలించడం అవసరం' అని రాష్ట్ర మహిళా శిశు అభివృద్ధి శాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేకాధికారి ఎ.సూర్యకుమారి అన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో భాగంగా శనివారం తణుకు మాంటిస్సోరి స్కూల్, జూనియర్ కళాశాల, బాలురోన్నత పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ సీహెచ్ నాగరాణి మాట్లాడుతూ 'ప్లాస్టిక్ వినియోగంతో వాతావరణ కాలుష్యం పెరుగుతోంది. తోపుడుబండ్ల నుంచి షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్ల వరకు ప్లాస్టిక్ కవర్లకు బదులు జూట్‌బ్యాగ్‌లు, పేపర్, గుడ్డ బ్యాగ్‌లను ఇవ్వాలని కోరారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల ప్రదర్శనను వారు పరిశీలించి అభినందించారు. తహసిల్దార్ అశోక్‌వర్మ, మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, ఎంపీడీవో జయసాగర్, ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు, ప్రిన్సిపాల్ ఎ.జ్ఞానమంజరి, దొమ్మేటి సుధాకర్, బసవా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నేరం
చీటింగ్ కేసులో రూ.50 లక్షలు రికవరీ
చేతబడి అనుమానంతో వ్యక్తిపై దాడి
కోర్టు ఆదేశాలతో ఆక్రమణల తొలగింపు
'పీఎంశ్రీ' పాఠశాలగా పెదతాడేపల్లి గురుకులం
- 7లో..

పబ్లిక్ పార్కులే.. ప్రైవేటు స్కూళ్ల ఆట స్థలాలు !

» తాడేపల్లిగూడెం ప్రత్యేకం
» స్థానికుల అభ్యంతరం

నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల నిర్వహణ..
కనీసం ఆట స్థలాలు లేకుండానే అనుమతులు



తాడేపల్లిగూడెం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలలకు మున్సిపల్ పార్కులు అడ్డాగా మారాయి. ఆయా పాఠశాలల్లో ఆట స్థలాలు లేకపోవడంతో తమ విద్యార్థులను తీసుకువచ్చి ఆటలు ఆడిస్తున్నారు. ఇదేదో తమ సొంత ఆట ఆస్తిలా భావిస్తూ ఉండడంపై తాడేపల్లిగూడెం వాసులు ముక్కున వేలేసుకుంటున్నారు. పట్టణంలోని మున్సిపల్ పార్కుల సమీపంలో వున్న చాలా ప్రైవేట్ పాఠశాలల్లో ఇదే పరిస్థితి వుంది. వాస్తవానికి ఒక ప్రైవేట్ స్కూల్ ఏర్పాటు చేయాలంటే.. భద్రతతో కూడిన భవనం, అందులో మౌలిక సదుపాయాలు ఉండాలి. ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ ఉండాలి. విద్యార్థుల ఆరోగ్య, భద్రత కోసం తగిన చర్యలు తీసుకోవాలి. విశాలమైన ఆట స్థలం, సీసీ కెమేరాలు, ఫస్ట్ ఎయిడ్ కిట్, టాయిలెట్స్, తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాలు కల్పించాలి. కాని, కొన్ని స్కూల్స్ తరగతి గదులు ఇరుకు ఇరుకుగా ఉన్నాయి. అందులోనే బోధన నిర్వహిస్తున్నారు. అలాగే విశాలమైన ఆటస్థలం తప్పనిసరిగా ఉండాలి. దీనికితోడు అగ్ని ప్రమాదాలు జరిగే సమయంలో అగ్నిమాపక వాహనం భవనం చుట్టూ తిరిగేలా ఖాళీ స్థలం వదులుకుని పాఠశాల భవనాలు నిర్మించాలి. కాని తాడేపల్లిగూడెంలోని ఎక్కువ ప్రైవేట్ పాఠశాలలకు అసలు పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలాలే లేవు. అయినప్పటికి విద్యా శాఖ అధికారులు వీటికి అనుమతులు ఇచ్చారు.

పాఠశాలలకు ఆట స్థలాలు లేకపోవడంతో సమీపంలో వున్న మున్సిపల్ పార్కులను అడ్డాగా చేసుకుని వాటిలోకి స్కూల్ పిల్లలను పంపుతున్నారు. పట్టణ ప్రజల కోసం ఉపయోగపడే పార్కులు.. ప్రైవేటు స్కూల్ విద్యార్థులు ఉపయోగించడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా లక్షలాది రూపాయల మున్సిపల్ నిధులతో ఏర్పాటు చేసిన పార్కుల్లో స్థానికులు సేద తీరలేకపోతున్నారు. ఇందులో వున్న బల్లలు, ఇతర వ్యాయామ పరికరాలు పాడైపోతున్నాయని ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి చేసిన పార్కులు ఇవే

తాడేపల్లిగూడెం పట్టణంలోని ప్రధానమైన వాటిలో చిరంజీవి పార్కు, 7వ వార్డులో స్కేటింగ్ పార్కు, రాకెట్ పార్కు, నల్లజర్ల రోడ్డులోని పార్కు, 19వ వార్డులోని పార్కు, హౌసింగ్ బోర్డు కాలనీలో ట్రాఫిక్ పార్కులను అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేశారు. ఇక్కడ సరైన పర్యవేక్షణ లేకపోవడంతో రక్షణ లేకుండా పోయింది. కొన్ని పార్కుల పక్కనే కార్పోరేట్, ప్రైవేట్ పాఠశాలలు ఉండటంతో పిల్లలు ఆడుకునేందుకు ఇవి ఆట స్థలాలుగా మారిపోతున్నాయి. ఆయా ప్రాంతలా ప్రజలకు, వారి పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన పార్కులు ఇలా ప్రైవేట్ పాఠశాలపరం కావడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి సమయంలో ఆ ప్రాంతాల ప్రజలు పాఠశాల నిర్వాహకులతో తరచూ గొడవ పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ పార్కులకు సరైన రక్షణ ఏర్పాటు చేసి ఆస్తులను పరిరక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఆటస్థలాలుగా మారిస్తే చర్యలు : కమిషనర్ ఏసుబాబు



మున్సిపల్ పార్కుల్లో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఆట స్థలాలుగా కేటాయిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రైవేట్ పాఠశాలలు ఆటస్థలాలను సమకూర్చుకోవాలి. అలా కాకుండా వారి స్కూళ్లల్లో చదువుతున్న పిల్లలను మున్సిపల్ పార్కులకు తీసుకుని వచ్చి ఆటలాడిస్తే కఠిన చర్యలు తప్పవు.



కట్టడి చేయాలి : ఆకుల శివ, స్థానికుడు

మున్సిపల్ అధికారులు పార్కులకు రక్షణ కల్పించాలి. ఇక్కడ ఉండే ప్రజలు పార్కుల్లో పిల్లలతో కలిసి కొంతసేపు సేదతీరేందుకు ఏర్పాటు చేస్తే ఇవి ప్రైవేట్ పాఠశాలల ఆధీనంలోకి వెళ్లిపోయాయి. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులే దాన్ని వినియోగించుకుంటే ఎలా ? తక్షణమే మున్సిపల్ అధికారులు కట్టడి చేయాలి.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

» మంత్రి గుమ్మడి సంధ్యారాణి



కొయ్యలగూడెంలో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి సంధ్యారాణి, బొరగం

కొయ్యలగూడెం, జూలై 19(ఆంధ్రజ్యోతి): 'సంక్షేమ పథకాలే కూటమి ప్రభుత్వ ధ్యేయం. ఎస్టీలకు ఐటీడీఏ ద్వారా అన్ని పథకాలు అందిస్తాం' అని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి హామీ ఇచ్చారు. కొయ్యలగూడెంలో శనివారం జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు'లో మంత్రి మాట్లాడుతూ.. 'ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోంది. టీడీపీ ప్రభుత్వంలో కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు వుంటే అందరికీ తల్లికి వందనం అమలు చేశాం' అన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్, అప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ పారేపల్లి రామారావు, తెలుగు మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శి మేఘలాదేవి, టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ, సర్పంచ్ ముప్పిడి విజయకుమారి, నాయకులు పాల్గొన్నారు.

ఎండ.. వాన.. ఉక్కపోత

» జిల్లాలో విచిత్ర వాతావరణం

భీమవరం టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విభిన్న వాతావరణం నెలకొంది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలు చుర్రుమన్నాయి. ఉక్కపోతతో జనం విలవిల్లాడారు. మధ్యాహ్నం మూడున్నర సమయంలో తణుకు, తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. భీమవరం, పాలకొల్లు, నరసాపురం, ఉండి పరిసర ప్రాంతాల్లో మబ్బులు కనిపించినా చిరు జల్లులు కురిశాయి. అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక జారీచేసింది. శుక్రవారం రాత్రి జల్లులు పడ్డాయి. దీని ప్రభావం శనివారం ఉదయం నుంచి జనం ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు నమోదైనప్పటికి తీవ్రత 40 డిగ్రీల మాదిరి కనిపించింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా నిన్నటి వరకు చినుకుల జాడ లేదు. రాత్రి కూడా ఉక్కపోతతో ఏసీలకు పనిచెప్పారు.



ఆలయ వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో స్వామి దర్శనం కోసం వేచిఉన్న భక్తులు

మార్మోగిన శ్రీవారి నామస్మరణ

ద్వారకాతిరుమల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి శేషాచలం భక్తజన సందోహంగా మారింది. స్వామికి ప్రీతికరమైన శనివారం కావడంతో ఆలయానికి వేలసంఖ్యలో భక్తులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించారు. ఆలయ పరిసరాల్లో శ్రీవారి నామస్మరణ మార్మోగింది. దాదాపు 15 వేలమంది భక్తులు శ్రీవారికి పూజలు జరిపినట్లు ఆలయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. తెల్లవారుఝాము నుంచే ఆలయానికి భక్తులరాక ప్రారంభమైంది. పలువురు భక్తులు కేశ ఖండన శాలలో మొక్కుబడులు తీర్చుకున్నారు. అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీవారి సాధారణ దర్శనానికి గంటల పైబడి సమయం పట్టింది.



ప్రిన్సిపాల్ రాజారావును అభినందిస్తున్న అధికారులు

'పీఎం శ్రీ' పాఠశాలగా పెదతాడేపల్లి గురుకులం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 25 గురుకుల పాఠశాలల్లో 'పీఎం శ్రీ' ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. ఈమేరకు శనివారం గురుకుల పాఠశాలను ఎంపిక కమిటీ సందర్శించింది. ఈ సందర్భంగా జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్యాంకుమార్ ఉత్తమ పీఎంశ్రీ పాఠశాలగా ఎంపికైనట్టు వివరించారు. పాఠశాలలో కిచెన్ గార్డెన్, ల్యాబ్, కెరీర్ గైడెన్స్ ల్యాబ్, ఫుడ్ ప్రాసెసింగ్, ల్యాబ్, డిజిటల్ క్లాసరూంలు తదితర అంశాల్లో ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజారావును ఎంఈవో వి.హనుమ, పీఎంకే జ్యోతి, ఏఎంవో సుబ్రహ్మణ్యం, పీఎంశ్రీ ఏఈ వీరస్వామి అభినందించారు.



పోలీసుల బందోబస్తు మధ్య ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

కోర్టు ఆదేశాలతో ఆక్రమణల తొలగింపు

ఆకివీడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): కోర్టు ఆదేశాల మేరకు అధికారులు ఆక్రమణలు తొలగించారు. స్థానిక ధర్మాపురం అగ్రహారంలోని మంచినీటి చెరువుగట్టున ఉన్న 24 మంది ఆక్రమణదారుల ఇళ్లను పోలీసు బందోబస్తు మధ్య నగర పంచాయతీ అధికారులు శనివారం నాలుగు ఎక్స్‌కవేటర్లతో తొలగించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు వంద మంది పోలీసులు సీఐ వి.జగదీశ్వరరావు నేతృత్వంలో నాలుగు టీమ్‌లుగా ఏర్పడి ఎటువంటి అల్లర్లు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. స్వల్ప ఘర్షణలు మినహా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం వరకు ఆక్రమణలు తొలగిస్తూనే ఉన్నారు. నగర పంచాయతీ కమిషనర్ కృష్ణమోహన్, మేనేజర్ వెంకటేశ్వరరావు, ఏఈలు సురేష్, విజయ్‌కుమార్, ఎస్ఐలు హనుమంతు నాగరాజు, కిరణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

చదరంగంతో మేధాశక్తి పెంపు

నరసాపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచి చదరంగం ఆడడం వల్ల మేధాశక్తి పెంపొందుతుందని ఆర్డీవో దాసిరాజు అన్నారు. శనివారం చిన మామిడిపల్లి సంసిద్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి చెస్ పోటీలను ఆయన ప్రారంభించారు. పలు ప్రాంతాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు వంద మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇటువంటి పోటీల వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులందించారు. జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు కిశోర్, ప్రిన్సిపాల్ దుర్గ లావణ్య సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో చెస్ ఆడుతున్న ఆర్డీవో దాసిరాజు

జంగారెడ్డిగూడెం మాజీ కమిషనర్‌కు ఏసీబీ నోటీసు ?

కావలి, జూలై 19(ఆంధ్రజ్యోతి):జంగారెడ్డిగూడెం మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో అక్కడ భవన నిర్మాణంలో జరిగిన అక్రమాలపై ప్రస్తుతం నెల్లూరు జిల్లా కావలి మునిసిపల్ కమిషనర్‌గా ఉన్న శ్రావణ్ కుమార్‌కు ఏసీబీ అధికారులు నోటీసు జారీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. పదిహేను రోజులలో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. ఈ విషయమై కమిషనర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా తాను తిరుపతిలో ఉన్నానని తనకు ఎలాంటి నోటీసు అందలేదని చెప్పారు. అయితే జంగారెడ్డిగూడెంలో పని చేసేటప్పుడు ఒక భవన నిర్మాణంపై కేసు నడుస్తుందనే విషయం తెలిపారు.

పొగ ఊదేస్తున్నారు



ధూమపానం నేరం.. నష్టం ఈ విషయం అందరికీ తెలిసిందే. కానీ కొంతమంది నిర్లక్ష్యం వల్ల కనీసం బహిరంగ ప్రదేశాల్లో కూడా నియంత్రణ సాధ్యం కావడం లేదు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాలు, దేవాలయ పరిసరాల్లో ధూమపానం నేరం అని నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేసి జరిమానాలు విధిచేస్తు న్నప్పటికీ పట్టించుకోవడం లేదు. విద్యాసంస్థల చుట్టూ వంద గజాల పరిధిలో పొగాకు ఉత్పత్తుల అమ్మకం నిషేధం.. అయినప్పటికీ ఇవేమి పట్టనట్టుగా యథేచ్ఛగా అమ్ముతున్నారు.. పొగ తాగేస్తున్నారు.. అవతలి వారిపై ఊదేస్తున్నారు. పొగ తాగడం వల్ల దుష్పరిణామాలు, కోట్పా చట్టం అమలు తీరుపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

ద్వారకాతిరుమల, జూలై 19 (ఆంధ్రజ్యోతి):

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నేరం

» కోట్పా చట్టం అమలులో లోపాలు » ఆచరణకు పటిష్ఠ ప్రణాళిక నిల్ ?

పొగ తాగే అలవాటు ఉన్న వారికి పక్కనున్న వారికి హానికరమని తెలిసినా... పొగబాబులు బహిరంగంగా దమ్ముకొడుతున్నారు. పలు దేశాలు, రాష్ట్రాలు బహిరంగ ప్రదేశాలలో పొగ త్రాగడం నిషేధించాయి. మన దేశంలోనూ బహిరంగ ధూమపానం చట్టరీత్యానేరం. జరిమానాలు కూడా ఉన్నాయి. ఇటువంటి వారిని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకొచ్చినప్పటికీ.. సినిమాహాల్స్, బస్‌కాంప్లెక్సులు, రైల్వేస్టేషన్లు, పార్కులు, ఆలయాల పరిసరాలను కూడా వదలకుండా కొంతమంది ధూమపాన ప్రియులు బహిరంగంగా స్మోకింగ్ చేసేస్తున్నారు. నో స్మోకింగ్ బోర్డులు ఎదురుగా ఉన్నప్పటికీ.. సినిమాల ప్రదర్శనలకు ముందు, టీవీల్లోనూ పొగత్రాగడం ఆరోగ్యానికి హానికరం అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నప్పటికీ వారు పట్టించుకోరు. ఇష్టమొచ్చిన రీతిలో ఎక్కడపడితే అక్కడ సిగరెట్లు పీల్చుతుంటారు. కోట్పా చట్టం సెక్షన్-4ప్రకారం బహిరంగ ధూమపానం నేరం... 200 రూపాయల వరకూ జరిమానా విధించవచ్చు.



ద్వారకాతిరుమలలో ఓ షాపులో పొగాకు ఉత్పత్తుల అమ్మకాలపై పోలీసుల తనిఖీలు (ఫైల్)

పాసివ్ స్మోక్ లేదా సెకండ్ హాండ్ స్మోక్

పక్కవాళ్లు స్మోక్ చేయడం వల్ల వచ్చే పొగను అప్రయత్నంగా పీల్చడం ద్వారా ఇతరులు ప్రాణాపాయానికి గురవుతుంటారు. దేశంలో గుండెజబ్బులు సంభవిస్తున్న ప్రతీ 20మంది మహిళల్లో ఆరుగురు ఈ పాసివ్ స్మోకింగ్ వల్లే మృత్యువాత పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. స్మోకింగ్ ప్రభావం వల్ల అనేక మంది మహిళలకు క్యాన్సర్ వస్తోంది, పాసివ్ స్మోకింగ్ వల్ల ముఖ్యంగా బ్రెస్ట్ కాన్సర్, చిన్నారులకు బ్లడ్ క్యాన్సర్ రావచ్చు. పొగ రాయుళ్ల వదిలే పొగ నుంచి విడుదలయ్యే విషప్రభావం గర్భిణులపై ప్రభావం ఉంటుంది. పుట్టే పిల్లలకు గుండె జబ్బులు, నరాల బలహీనత, పేగుక్యాన్సర్ వంటి ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుతాయి. పొగతాగే వాళ్ల పక్కనున్న వారు ఏ తప్పు చేయకుండానే పలువురు అనారోగ్యం బారిన పడుతున్నారు.

కోట్పా చట్టం కఠినం చేయాలి..

పవిత్రమైన దేవాలయాల సమీప ప్రాంతాలను సైతం పొగ రాయుళ్లు వదలకుండా రెచ్చిపోతున్నారు. ఇప్పటికే తిరుమల తిరుపతి, విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మ ఆలయాలు పొగాకు ఉత్పత్తులను నిషేధించాయి. ఆధ్యాత్మిక ప్రాంతం పరిసరాలలో ఆరోగ్యవంతమైన వాతావరణం కోసం ధూమపానం చేయకుండా చర్యలు చేపట్టింది. సిగరెట్స్ అన్ అదర్ టుబాకో ప్రొడక్ట్స్ యాక్టు-2003 (కోట్పా)ను పటిష్ఠంగా అమలు చేస్తోంది. పొగ తాగే వారితో పాటు దానిని పీల్చే వారిలో 30 శాతం మందికి ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తోందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని కేంద్రప్రభుత్వం ఈ చట్టం తీసుకొచ్చింది.

కోట్పా చట్టం ప్రధాన లక్ష్యాలు

- పొగాకు ఉత్పత్తుల ప్రకటనలను నిషేధించడం
- పొగాకు ఉత్పత్తుల వాణిజ్యం, ఉత్పత్తి, సరఫరా, పంపిణీలను నియంత్రించడం

ముఖ్య నిబంధనలు ఇలా..

- మైనర్లకు సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల అమ్మకాలను నిషేధించడం
- విద్యాసంస్థల చుట్టూ వంద గజాల పరిధిలో పొగాకు ఉత్పత్తుల అమ్మకం నిషేధం
- పొగాకు ఉత్తత్తుల ప్యాక్‌లపై ఆరోగ్య హెచ్చరికలు తప్పనిసరి.
- సినిమాలు, టీవీ కార్యక్రమాల్లో పొగాకు వాడకాన్ని చిత్రీకరించడంపై నియంత్రణలు ఉన్నాయి.
- పొగాకు ఉత్పత్తుల పరోక్ష ప్రకటనల నిషేధం

కోట్పా చట్టం అమలు ఇలా..

ఈ చట్టాన్ని అమలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహిస్తాయి. జాతీయ ఆరోగ్య మిషన్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ చట్టం అమలుకు కీలక పాత్ర పోషిస్తాయి. రాష్ట్రస్థాయిలో పొగాకు నియంత్రణకు ఈ చట్టాన్ని అమలు చేసేందుకు శిక్షణ అవగాహన, కార్యక్రమాలు పర్యవేక్షణ కార్యకలాపాలు నిర్వహిస్తాయి. కోట్పా చట్ట నిబంధనలను అతిక్రమిస్తే భారతీయ న్యాయసంహిత చట్టాల ప్రకారం కఠిన చర్యలుంటాయి. పొగాకు వాడకాన్ని తగ్గించడానికి, ప్రజారోగ్యాన్ని మెరుగు పర్చడానికి ఈ చట్టాన్ని రూపొందించారు. చాలా మందికి ఈ చట్టం పట్ల అవగాహన లోపం, అధికారుల నిర్లక్ష్యం వెరసి అమలులో లోపాలు కన్పిస్తున్నాయి.

బదిలీలపై మళ్లీ భగ్గు !

» సవరణలతో కూడిన సచివాలయ ఏఎన్‌ఎంల బదిలీలపై ఫిర్యాదులు



ఏలూరు అర్బన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎం(హెల్త్ సెక్రటరీ)లకు ఇటీవల జరిగిన బదిలీల్లో తాజాగా మరోదఫా మార్పులు, చేర్పులు చేటుచేసుకున్నాయి. ఒకేచోట ఐదేళ్ల సర్వీసు ముగిసిన ఏఎన్ఎంలకు ఈనెల మొదట్లో జరిగిన బదిలీల కౌన్సెలింగ్‌పై వివాదాలు చెలరేగిన విషయం విదితమే. ఈమేరకు బదిలీలు ఖరారైన 594మంది ఏఎన్ఎంలను విధుల నుంచి రిలీవ్ చేయవద్దని, ఆ మేరకు తదుపరి ఉత్తర్వులిచ్చేవరకు ఎక్కడివారక్కడే పనిచేయాలని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు మౌఖిక ఆదేశాలిచ్చాయి. దీనికనుగుణంగానే తొలుత విడుదల చేసిన జాబితాలో బదిలీ స్థానాలు ఖరారైనవారిలో పలువురి స్థానాలను సవరిస్తూ మొత్తం 584మంది రూరల్ ఏఎన్ఎంలతో కూడిన జాబితాను తాజాగా శుక్రవారం రాత్రి విడుదల చేయగా, శనివారం ఉదయం నుంచే పలువురు ఫిర్యాదులతో వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి చేరుకోవడం ప్రారంభమైంది. తొలుత జరిగిన జూమ్ కౌన్సెలింగ్‌లో నిబంధనల మేరకు బదిలీ స్థానాలు ఖరారైన పలువురు ఏఎన్ఎంలు తాజాగా సవరణలతోకూడిన జాబితాలో స్థానచలనం కలగడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. తమ ప్రమేయం లేకుండా, కనీసం ఐచ్ఛికాలివ్వని స్థానాలకు ఏకపక్షంగా ఎలా బదిలీచేస్తారని ప్రశ్నించారు. ప్రతీ మండలంనుంచి ఇటువంటి ఫిర్యాదులున్నట్టు తెలుస్తోంది. ఫిర్యాదులను తీసుకున్న డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది, బదిలీల ప్రక్రియకు సంబంధించిన తాజా సవరణల్లో అభ్యంతరాలను మాత్రమే స్వీకరిస్తామని, వాటిని పరిష్కరిం చాల్సిన అధికారులు, సంబంధిత సెక్షన్ ఉద్యోగి ప్రస్తుతం అందుబాటులో లేరని పంపించేస్తున్నారని వాపోతున్నారు.

బదిలీ ఏఎన్‌ఎంలలో ఆందోళన

తాజాగా విడుదల చేసిన జాబితాలోవున్న ఏఎన్ఎంలందరూ తక్షణమే పనిస్థానాల్లో విధుల నుంచి రిలీవై, ఆ వెంటనే నూతన బదిలీస్థానాల్లో చేరాలని డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు ఆదేశాలు జారీచేయడంతో నష్టపోయిన ఏఎన్ఎంలలో ఆందోళన నెలకొంది. మరోవైపు తొలుత విడుదల చేసిన బదిలీల జాబితా, తాజాగా సవరణలతో కూడిన జాబితా రెండింటిపైనా రిలీవింగ్, జాయినింగ్‌లను ఈనెల 5వ తేదీని పేర్కొనగా, ఇప్పుడు శనివారం కొత్తస్థానాల్లో చేరితే సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశాలు లేకపోలేదని తెలుస్తోంది. ఇటీవల జిల్లానుంచి బదిలీఅయిన అధికారి పాలనలో జరిగిన ఉద్యోగుల సాధారణ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియల్లో పారదర్శకత లోపించిందనడానికి డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద గత నెలలో ఒకరోజున తెల్లవారుఝాము వరకు జరిగిన ఆందోళనలు, ఒకసారి బదిలీ ఖరారైన ఉద్యోగుల్లో కొందరికి మళ్లీ మార్పులు, ఆ మేరకు కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత సవరణలు, ఉన్నతాధికారుల చీవాట్లు, స్వయంగా ప్రజాప్రతినిధులే జోక్యం చేసుకోవాల్సి రావడం.. తదితరాలన్నీ పరిపాలనాపరమైన వైఫల్యాలుగా భావిస్తున్నారు.

అన్యాయం జరిగితే నేరుగా సంప్రదించండి : డీఎంహెచ్‌వో



సచివాలయ ఏఎన్ఎంల బదిలీలపై వస్తున్న ఫిర్యాదులపై డీఎంహెచ్‌వో డాక్టర్ పీ.జే.అమృతం వద్ద వివరణ కోరగా కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాతే తాను జిల్లాలో బాధ్యతలు చేపట్టినందున పూర్తివివరాలు తెలియవన్నారు. బదిలీలు ఖరారైన ఏఎన్ఎంలలో కొందరు తమ పనిస్థానాలు, మండలాల పేర్లలో తప్పులు దొర్లాయని శనివారం ఫిర్యాదు చేశారని, వాటిని పరిశీలించి పరిష్కరించాల్సిందిగా కార్యాలయ సిబ్బందిని ఆదేశించానన్నారు. ఇంకా ఎవరికైనా బదిలీల్లో అన్యాయం జరిగిందని భావిస్తే, దానికి సహేతుకమైన ఆధారాలతో నేరుగా వస్తే పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు.

ఏలూరు జిల్లాలో ఆరు శక్తి టీమ్‌లు

» అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు



ఏలూరు క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మహిళల రక్షణే పోలీస్ ప్రధాన కర్తవ్యమని ఈ దిశగా ప్రత్యేక బృందాలు పని చేయడానికి ఏలూరు జిల్లాలో ఆరు శక్తి టీమ్‌లను ఏర్పాటు చేశామని అదనపు ఎస్పీ ఎన్. సూర్యచంద్రరావు తెలిపారు. జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శక్తిటీమ్ పోలీస్ సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల రక్షణకు ఆరు శక్తి టీమ్‌లు ఏర్పాటు చేశామని, ఒక్కొక్క టీమ్‌లో ఆరుగురు సభ్యులు చొప్పున, జిల్లాలో మొత్తం 36 మంది ప్రత్యేక విధులను నిర్వరిస్తారన్నారు. మహిళల పట్ల దాడులు, అఘాయిత్యాలు, వేధింపులు లేకుండా చేసేందుకు ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో జిల్లాలో ప్రత్యేకంగా శక్తిటీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఈ టీమ్‌లు జిల్లాలోని కళాశాలలు, పార్కులు, ఆర్టీసీ బస్టాండ్లు, స్కూళ్ళు, కాలేజీలు, ముఖ్యమైన కూడళ్లలో మఫ్టీలో కొందరు, యూనిఫామ్‌లో కొందరు నిఘా పెడతారన్నారు. ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే తక్షణమే వారిని అదుపులోకి తీసుకుంటారని తెలిపారు. ఆపద సమయంలో శక్తియాప్‌లో ఎస్ఓఎస్ కాల్స్, డయల్ 112కు కాల్ చేస్తే శక్తిటీమ్ బృందాలు పది నిమిషాల్లోనే సంఘటనా స్థలానికి చేరుకుంటాయన్నారు. సమస్యను చట్ట బద్ధంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారన్నారు. ఈ శక్తిటీమ్ సభ్యులకు బాడీ కెమెరాలు ఉంటాయని అదేవిధంగా డ్రోన్లతో కూడా నిఘా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం సమాచారం

గుర్తు తెలియని రెండు మృతదేహాలు లభ్యం

కలిదిండి/ఉండి,జూలై 19(ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల రెండు గుర్తు తెలియని మృతదేహాలు లభ్యమ య్యాయి. కలిదిండి ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి.. కోరుకొల్లు వద్ద కాలువలో గుర్తు తెలియని వ్యక్తి(35) మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సన్నటి గెడ్డం, ఐదు అడుగుల ఎత్తు. మృతుడు రెండు రోజుల క్రితం గుడ్లవల్లేరు నుంచి కోరుకొల్లు వచ్చే కాలువలో ప్రమాదవశాత్తు పడి చనిపోయి కొట్టుకొచ్చినట్టుగా పోలీసులు భావిస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు 94407 96435 నంబరుకు సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

- ఉండి మండలం బొండాడ డ్రెయిన్‌లో వాంద్రం వద్ద గుర్తు తెలియని మృతదేహం ఉందని స్థానికులు తెలిపిన సమాచారంతో ఉండి పోలీసులు వెళ్లి పరిశీలించారు. ఈ మృతదేహాన్ని గ్రామ రెవెన్యూ అధికారి చిన్నారావు పరిశీలించి సుమారు 50 ఏళ్ల లోపు వయసు గల వ్యక్తిగా గుర్తించారు. ఆచూకీ తెలిసిన వారు ఉండి ఎస్ఐ నజీరుల్లా 94407 96648 నంబరుకు సంప్రదించాలన్నారు.

ఆటోను ఢీకొట్టిన బస్సు.. ఆటో డ్రైవర్‌కు గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి జాతీయ రహదారిపై ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలైన ఘటన శనివారం జరిగింది. పెదతాడేపల్లికి చెందిన కటారి నాగేశ్వరరావు తాడేపల్లిగూడెం వైపు వస్తుండగా ఆర్టీసీ బస్సు వెనుకనుంచి ఢీకొట్టింది. ఆటో బోల్తా పడడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణికులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. క్షత గాత్రుడిని విజయవాడకు మెరుగైన చికిత్స కోసం తరలించారు.

షాపులో నగదు చోరీ

ఏలూరు క్రైం, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాత్రివేళ ఒక షాపు తాళాలు పగులగొట్టి దొంగలు నగదు అపహరించుకు పోయారని ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. ఏలూరు రూరల్ సుంకరవారితోటకు చెందిన తోట మౌనిష ఏలూరు గడియారపు స్తంభం వద్ద షైనీ కిట్స్‌ప్లే జోన్ షాపు నిర్వహిస్తున్నారు. ఈనెల పదో తేదీ రాత్రి యథావిధిగా షాపు తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. పదకొండో తేదీ ఉదయం అక్కడ ఉన్న వాచ్‌మన్ ఫోన్ చేసి షాపు తాళాలు పగులగొట్టి ఉన్నాయని చెప్పడంతో మౌనిష వెళ్లి పరిశీలించారు. షాపులోని రూ.18 వేల నగదు అపహరణకు గురైందని గుర్తించారు. ఈ ఘటనపై శనివారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

స్వీపర్ అనుమానాస్పద మృతి !

పాలకోడేరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): మోగల్లు గ్రామ పంచాయతీలో స్వీపర్‌గా పనిచేస్తున్న పెనుమాల మరియమ్మ(43) అనుమానాస్పద స్థితిలో శనివారం మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన ఆమె గత నెల నుంచి పంచాయతీలో స్వీపర్‌గా పని చేస్తుంది. శనివారం ఉదయం పనులు ముగించుకుని ఇంటికి వెళ్లిన ఆమె ఇంటి వద్దే పడుకుంది. కారణం ఏమో తెలియదు గాని శనివారం మధ్యాహ్నాంకు గుండె బరువెక్కుతుందని స్థానికులకు చెప్పడంతో వారు తొలుత పాలకోడేరు ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె మృతి చెందిందని వైద్యులు నిర్ధారించడంతో ఇంటికి తిరిగి తీసుకొచ్చారు. దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

చీటింగ్ కేసులో రూ.50 లక్షలు రికవరీ

చింతలపూడి,జూలై19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన షేక్ ఖాసిం అనే వ్యక్తిని మోసం చేసిన చింతలపూడికి చెందిన రాజకుమార్, ప్రవీణ్ అనే ఇద్దరు రూ.50 లక్షలు కాజేయగా వారిని చాకచక్యంగా పట్టుకుని నగదు రికవరీ చేశామని జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర తెలిపారు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు కంపెనీలో మేనేజర్‌గా పనిచేసే షేక్ ఖాసిం అనే వ్యక్తికి చింతలపూడికి చెందిన రాజకుమార్, ప్రవీణ్ అనే ఇద్దరు అతని కంపెనీ అవసరాలకు తక్కువ వడ్డీకి డబ్బు ఇస్తామని చెప్పి షూరిటీగా రూ.50 లక్షలు ముందుగా తేవాలని, కంపెనీ డాక్యుమెంట్లు తీసుకుని రమ్మనగా ఆ వ్యక్తి ఈనెల 18న చింతలపూడి రాగా వారిద్దరూ చింతలపూడిలోని ఎరుకులపేటలోని ఒక ఇంటికి తీసుకువెళ్లి డబ్బులు లెక్కపెట్టే నెపంతో ఇంటిలోకి తీసుకువెళ్ళి తలుపు వేసుకుని షేక్ ఖాసింను మోసం చేసి వేరేమార్గంలో అక్కడి నుంచి పారిపోయారని తెలిపారు. బాధితుడు చింతలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా చీటింగ్ కేసు నమోదు చేశారని, సీఐ క్రాంతికుమార్, ఎస్ఐ కె.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితులను గుర్తించి మోసపూరితంగా తీసుకుని రూ.50 లక్షల నగదును స్వాధీనం చేసుకుని ఫిర్యాదుదారునికి అందించినట్టు తెలిపారు. చింతలపూడి పోలీసులు చాకచక్యంతో నిందితులను పట్టుకోవడంతో బాధితునికి న్యాయం జరగడంతో జిల్లా ఎస్పీ అభినందించారని తెలిపారు.

గంజాయి కేసులో ఏ7 ముద్దాయి అరెస్ట్

జంగారెడ్డిగూడెం,జూలై 19 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసుతో సంబంధం ఉండి తప్పించుకుని తిరుగుతున్న పిడుగు శ్రీనివాస తమ్మారావు అలియాస్ బాబీ అనే నిందితుడిని జంగారెడ్డిగూడెం పోలీసులు అరెస్టు చేశారని సీఐ ఎంవీ సుభాష్ తెలిపారు. సీఐ మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ 29న గంజాయి తరలిస్తున్న ఐదుగురు ముఠా సభ్యులను జంగారెడ్డిగూడెం పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 394.79 కిలోల గంజాయి, ఒక మారుతీ కారు, వ్యాన్ సీజ్ చేసినట్టు తెలిపారు. అదే కేసులో కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం గోరింట గ్రామానికి చెందిన ఏ-7 నిందితుడు పిడుగు శ్రీనివాసతమ్మారావు అలియాస్ బాబీ రాజమహేంద్రవరం వైపు వెళ్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి బైక్, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. నిందితుడు తమ్మారావుపై గతంలో మండపేట రూరల్, తిమ్మాపురం, జగ్గంపేట, రాజమహేంద్రవరం ప్రకాశ్‌నగర్ తదితర పోలీస్ స్టేషన్లలో 36 దొంగతనం కేసులున్నాయని, దేవరపల్లి, పెనుమంట్ర, రాజమహేంద్రవరం, నెల్లూరు జిల్లా వి.సత్రం పోలీస్ స్టేషన్లలో గంజాయి అక్రమ రవాణా కేసులున్నట్టు తెలిపారు. ఇదే కేసుతో సంబంధం ఉన్న మరో నిందితుడి కోసం గాలిస్తున్నట్టు తెలిపారు.

చేతబడి అనుమానంతో వ్యక్తిపై దాడి

» తెల్లపల్లి గ్రామంలో ఘటన.. ఇద్దరిపై కేసు నమోదు

వేలేరుపాడు, జూలై19(ఆంధ్రజ్యోతి): తమపై చేతబడి చేసి హతమార్చే విధంగా ప్రయత్నిస్తున్నాడనే అనుమానంతో ఓ వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన శనివారం వేలేరుపాడు మండలం తెల్లపల్లి గ్రామంలో జరిగింది. వేలేరుపాడు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాలివి.. తెల్లపల్లి గ్రామానికి చెందిన సిరమయ్య, మడకం దేవరాజు, చోడే జోగయ్య మధ్య కొంతకాలంగా భూతగాదాలు ఉన్నాయి. తరచూ వీరి మధ్య గొడవలు జరుగుతున్న నేపథ్యంలో మడకం దేవరాజు, చోడే జోగయ్య అనారోగ్యానికి గురవుతున్న నేపథ్యంలో సిరమయ్య తమపై చేతబడి చేస్తున్నాడనే అనుమానంతో గొడవలు మరింతగా ముదిరాయి. ఈ కారణంగానే సిరమయ్యను హతమార్చాలనే నిర్ణయానికి వచ్చిన వారిద్దరూ దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ దాడిలో సిరమయ్య తలకు తీవ్రగాయాలు కావడంతో వేలేరుపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం నిర్వహించిన అనంతరం అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



హోమం నిర్వహిస్తున్న తమిళనాడు భక్తులు

తమిళనాడు భక్తుల వాసవీ హోమం

పెనుగొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): పెనుగొండలోని వాసవీ శాంతి ధామ్‌లో శనివారం తమిళనాడు రాష్ట్రం తిరుపూరు నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. తొలుత వాసవీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

కామవరపుకోట, జూలై 19(ఆంధ్రజ్యోతి): తడికలపూడి పోలీసులు శుక్రవారం రాత్రి రామన్నపాలెం సమీపంలో వాహనాలు తనిఖీ చేయగా ఒక బొలేరో వాహనంలో 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్టు గుర్తించి రెవెన్యూ శాఖకు సమాచారం అందించారు. సివిల్ సప్లయిస్ డీటీ శేషగిరి వాహనంలో వున్న పీడీఎస్ బియ్యంగా గుర్తించి సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారు. వ్యాన్‌ను తడికలపూడి పోలీసులు సీజ్ చేశారు.

వచ్చే నెల 17 వరకు పోలీస్ 30 యాక్ట్

మొగల్తూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల దృష్ట్యా నరసాపురం డివిజన్‌లో ఆగస్టు 17వ తేదీ వరకు పలు ఆంక్షలు విధించినట్టు డీఎస్పీ డాక్టర్ శ్రీవేద తెలిపారు. శుక్రవారం నుంచి ఆగస్టు 17 వరకు సబ్ డివిజన్ పరిధిలో పోలీసు యాక్టు అమలులో ఉంటుందన్నారు. ముందస్తు అనుమతులు లేకుండా సబ్ డివిజన్ పరిధిలో ఎలాంటి బహిరంగ సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు జరపకూడదన్నారు. నిషేధిత ఆయుధాలు వాడకూడదని, భారీ జన సమూహంతో సమావేశాలు నిర్వహించకూడదన్నారు.

డ్రై ఫ్రూట్స్ అలంకరణలో వెంకన్న



నరసాపురం రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): వేములదీవి గ్రామంలో శనివారం వైభవ వెంకటేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక అలంకరణ చేశారు. డ్రై ఫ్రూట్స్‌తో స్వామివారికి అలంకరణ చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

మంచినీటి చెరువు పరిశీలన



చెరువులో బ్లీచింగ్ చల్లుతున్న దృశ్యం

కాళ్ళ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కోలనపల్లి రక్షిత మంచినీటి సరఫరా చెరువులో చేపలు మృత్యువాతపై గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారంటూ 'మంచి నీటి చెరువులో చేపల మృతి' శీర్షికతో శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం ఉదయం డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పంచాయతీ అధికారులతో కలిసి చెరువును పరిశీలించారు. మంచినీటి చెరువులో చనిపోయి తేలుతున్న చేపలను తీసివేసి చెరువు గట్ల చుట్టూ ఉన్న చెత్త, మొక్కలను మనుషులతో తొలగించారు. ఎండ వేడికి ఆక్సిజన్ లోపంతో చేపలు చనిపోయాయని, ఎవరూ అపోహపడవద్దన్నారు. చెరువు అంతా బ్లీచింగ్‌తో సూపర్ శానిటేషన్ చేయించారు. ప్రజలంతా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని 'టాంటాం' వేయించారు. చెరువుకు కాళ్ళలంక ఛానల్ నుంచి పూర్తి స్థాయిలో పంట నీరు నింపాలని అధికారులకు ఆదేశించారు.

సామాజిక తనిఖీలో డ్వామా పీడీ అసహనం



ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ సీహెచ్‌వీ అప్పారావు

ఉండి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో తేడాలపై డ్వామా పీడీ సీహెచ్ అప్పారావు తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన నిబంధనలు ప్రకారం చేయడం కాకుండా మీఇష్టానుసారంగా చేయడం కరెక్టు కాదని ఆయన అన్నారు. పనులను చేయకుండానే చేసినట్లు చూపించడం ఎంతవరకు కరెక్టు అంటూ ఆయన ప్రశ్నించారు. ఉండి మండలంలోని 18వ విడత సామాజిక తనిఖీలకు సంబంధించి ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో సుమారుగా 400 పనులను చేశారు. ఈపనులకు సంబంధించి అధిక చెల్లింపులు సుమారుగా రూ.3కోట్ల 7లక్షలపైగా నగదు వుందంటూ ఆయన ఆరోపించారు. ఉదయం 10గంటలకు ప్రారంభమైన సామాజిక తనిఖీలు రాత్రి 8గంటల వరకు నిర్వహించారు. ఆయా గ్రామాలలో పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లుకు ఫైన్ వేసి హెచ్చరించారు.

స్కూల్ బస్‌ల రికార్డులను అప్‌డేట్ చేసుకోవాలి



తణుకులో స్కూల్ బస్సు డ్రైవర్‌తో మాట్లాడుతున్న రవాణా శాఖాధికారులు

తణుకు రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల వాహనాలకు సంబంధించిన రికార్డులన్నీ అప్‌డేట్ చేసుకోవాలని తణుకు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాస్ అన్నారు. శనివారం తణుకు వేల్పూరు రోడ్డులో ప్రైవేట్ బస్సులను ఆపి తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ యాజమాన్యాలు తమ వాహనాలకు సంబంధించిన రికార్డులతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ అన్ని చెల్లుబాటు అయ్యేవిధంగా వుంచుకోవాలన్నారు. స్కూల్ బస్సులలో పరిమితికి మించిన విద్యార్థులను ఎక్కించవద్దని సూచించారు. ఈ తనిఖీలలో ఒక స్కూల్ బస్సును జప్తు చేయడం జరిగిందని తెలిపారు.

మందకొడిగా సార్వా నాట్లు



పెనుగొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): శివారు ప్రాంతాల్లో పొలాలకు నీరు వెళ్ళడం లేదు. దానికి తోడు వర్షాలు లేకపోవడంతో సార్వా పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఖర్చులు పెరిగిపోవడంతో ఏం చేయాలో తోచక సతమతమవుతున్నారు. ఎకరా నారుమడికి రూ. 4 వేలు, నాట్లు వేసేందుకు కూలీలకు రూ. 4 వేలు, ట్రాక్టర్‌తో దుక్కి చేయడానికి తొలి దఫా ఎరువులకు రూ. 16 వేలు అవుతుందని వాపోతున్నారు. కలుపుతీత, క్రిమి సంహారక మందులు పిచికారి, సస్యరక్షణ చర్యలకు మరో 14 వేలుతో కలిసి సుమారు 8 వేలు పెట్టుబడి అవుతుందని వాపోతున్నారు. కూలీల కొరత, ట్రాక్టర్‌లు, వరికోత యంత్రాలు అద్దెలను పెంచడంతో పెట్టుబడులు పెరుగుతున్నాయని ఇటువంటి తరుణంలో వాతావరణం అనుకూలించకపోతే దిగుబడులు తగ్గి అప్పులే మిగులుతాయని వాపోతున్నారు. ఇదిలా ఉండగా కొన్ని ప్రాంతాల్లో మాత్రం పెనుగొండ, మునమర్రు, వడలి, సిద్ధాంతం వంటి గ్రామాల్లో నీరు చేరవడంతో బెంగాల్ కూలీలతోనే వరి నాట్లు వేస్తున్నారు.

ఏఐ టెక్నాలజీని ఉపయోగించండి

భీమవరం టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ అధికారులు, సిబ్బంది చట్టాలు, నిబంధనలు పూర్తిగా అవగాహన చేసుకోవడంతో పాటు ఏ.ఐ టెక్నాలజీని ఉపయోగించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. కుల ధ్రువ పత్రాల జారీ, ప్రభుత్వ భూమి ఆక్రమణల తొలగింపు తదితర అంశాలపై శనివారం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన రెవెన్యూ ఉద్యోగుల శిక్షణ కార్యక్రమానికి జేసీ రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అన్ని శాఖలలో రెవెన్యూ శాఖ ఎంతో కీలకమైనదని, ఈ శాఖ ద్వారానే ముఖ్యమైన పాలనాపరమైన నిర్ణయాలు తీసుకోవడం జరుగు తుందన్నారు. కావున రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు చట్టాలు, వాటిలోని నిబంధనలు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు.

తోట సీతారామలక్ష్మిని కలిసిన ఏఎంసీ చైర్మన్



భీమవరం టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశంపార్టీలో కష్టపడేవారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ గా నియమితులైన కలిదిండి సుజాత రామ చంద్రరాజు దంపతులు శుక్రవారం సీతారామలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఎంసీ పదవి ఇప్పించడానికి కృషి చేసినందుకు సీతారామలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు.

వికసించిన బ్రహ్మకమలం



అత్తిలిలో ముత్యాల సూర్యప్రకాష్ ఇంటి ఆవరణలో బ్రహ్మ కమలం వికసించింది. సంవత్సరంలో ఒక్కసారే పుష్పించే ఈ పుష్పం రాత్రి సమయంలో విచ్చుకొని తెల్లవారగానే ముడుచుకుంటుంది. పలువురు బ్రహ్మ కమలాన్ని చూడడానికి సూర్య ప్రకాష్ ఇంటిని సందర్శిస్తున్నారు.

- అత్తిలి

కూటమి పాలనలోనే రోడ్లకు మోక్షం

ముమ్మరంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలు





పరిమెళ్ళలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వలవల బాబ్జి... సిద్ధాంతంలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని

పెనుగొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వడలి, సిద్ధాంతం, పెనుగొండ గ్రామాల్లో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పితాని మాట్లాడుతూ గత పాలకులు ప్రజా సమస్యలు చెబితే వారిపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులు పెట్టేవారని, కాని కూటమి ప్రభుత్వంలో ఆ ఇబ్బందులన్ని తొలగిపోయాయన్నారు. జగన్ ప్రభుత్వం గుంతలు కూడా పూడ్చలేకపోయిందని సీఎం చంద్రబాబు గుంతలు పూడ్చడంతో పాటు కొత్త రోడ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. సర్పంచ్‌లు నక్కా శ్యామలా సోని శాస్త్రి, చింతపల్లి గనిరాజు, ఏఎంసీ ఛైర్మన్ బడేటి వీరబ్రహ్మం(బ్రహ్మజీ), నక్కా వేద వ్యాస శాస్త్రి, కటికి నానాజీ, రొక్కాల సురేష్, కూనపరెడ్డి రాజు, రాపాక నాగరాజు, తానేటి శేకర్, పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపాలి

పెనుగొండ శివారు చెరుకువాడలో గంజాయి విక్రయాలు పెట్రేగిపోతున్నాయని వాటిపై ఉక్కుపాదం మోపాలని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పెనుగొండ ఎస్ఐ కొప్పిశెట్టి గంగాధర్‌ను ఆదేశించారు. గంజాయి విక్రయించేవారు ఏ పార్టీ వారు అయినా సరే ఉపేక్షించేది లేదని కఠినంగా శిక్షించాలన్నారు. ఇటీవల పెనుగొండ గ్రామ శివారు చెరుకువాడలో ఆరు దొంగతనాలు జరిగాయని పోలీసులు వాటిపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా ఉన్నారని స్థానికులు ఆరోపించారు.

నరసాపురం రూరల్: ప్రజలకు మంచి పాలన అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మైనార్టీ సలహాదారు ఎంఏ షరీఫ్ అన్నారు. శనివారం చామకూరిపాలెం గ్రామంలో టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజులతో కలిసి సుపరిపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధిని వివరించారు. పార్టీ నాయకులు వాతాడి ఉమా, హరిచంద్ర, రాంబాబు, శ్రీను, రామకృష్ణ, నర్సింహరావు, ప్రభుదాసు పాల్గొన్నారు.

పెంటపాడు: ప్రభుత్వం అందిస్తున్న పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, భవన, కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి అన్నారు. శనివారం పరిమెళ్ళ, యానాలపల్లి గ్రామాలలో మండల టీడీపీ అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, గంధం సతీష్, సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు, అచ్యుత సత్యనారాయణ పాల్గొన్నారు

ఉపాధ్యాయుల్ని సర్దుబాటు చేయాలి

నరసాపురం రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎంఈవో పుష్పరాజ్యంకు వినతిపత్రం అందించారు. స్కూళ్ల ప్రారంభంలో అడ్మిషన్ల డ్రైవ్ నిర్వహించడం వల్ల విద్యార్థుల సంఖ్య గతం కంటే పెరిగిందని, దానికి అనుగుణంగా కొత్తగా వచ్చిన ఉపాధ్యాయుల్ని సర్దుచేయాలని విన్నవించారు. దీనిపై ఎంఈవో సానుకూలంగా స్పందించారు. జిల్లా కార్యదర్శి కృష్ణకుమారి, ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్, పి శాంసన్, ఎస్వీ సత్యనారాయణ, రాజశ్రీ, కె కళ్యాణి పాల్గొన్నారు.

'జాగృతి'పై అవగాహన కల్పించాలి

భీమవరం క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన 'జాగృతి' పథకం గురించి సభ్యులకు అవగాహన కల్పించే నిమిత్తం శనివారం ఒకటవ అదనపు సివిల్ న్యాయ అధికారి(జూనియర్ డివిజన్) పి.హనీషా అధ్యక్షతన 'ఓరియంటేషన్' కార్యక్రమం నిర్వహించారు. న్యాయ అధికారి పి.హనీషా మాట్లాడుతూ అన్ని శాఖల నుంచి అధికారులను సమన్వయపరుచుకుంటూ అట్టడుగున ఉన్న ప్రజల వరకు న్యాయసేవలు, పథకాలు అందేలా చర్యలు తీసుకోవడమే జాతీయ న్యాయ సేవాధికార సంస్థ రూపొందించిన 'జాగృతి' పథకం ముఖ్యఉద్దేశమని అన్నారు. అందుకనుగుణంగా సంస్థ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని, ఈ సమావేశాల్లో జాగృతి టీం సభ్యులు భాగస్వామ్యం కావాలని అన్నారు.


మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి. వాసుదేవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం భీమవరం మున్సిపల్ ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీలో ఇంజనీరింగ్ కార్మికుల కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు సమస్యలు పరిష్కరించని పక్షంలో వచ్చేనెల 16 నుంచి సమ్మె చేస్తామని తెలిపారు.

తాడేపల్లిగూడెం: రాష్ట్రప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం చేస్తామని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల ఆందోళన తాడేపల్లిగూడెం పట్టణంలో శనివారానికి రెండవ రోజుకు చేరింది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై రాష్ట్రప్రభుత్వ మొండి వైఖరి విడనాడాలని కోరారు.

ఖాతాదారులకు ఉత్తమ సేవలే లక్ష్యం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు అత్యుత్తమ సేవలు అందించడమే లక్ష్యంగా బ్యాంకులు పనిచేస్తాయని బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ సుభాకర్ పేర్కొన్నారు. మోదుగగుంటలో కిసాన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఖాతాదారులు తమకు గ్రామంలో బ్రాంచి ఏర్పాటు చేయాలని కోరగా ఏర్పాటుకు సానుకూలంగా స్పందించారు. అనంతరం బ్యాంకు ఆధ్వర్యంలో రూ.10కోట్ల రుణాలను ఖాతాదారులకు అందించారు. విశాఖ జోనల్ మేనేజర్ నితేష్‌కుమార్ సిన్హా, బ్యాంకు ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



తణుకు సబ్ జైలు రికార్డులను పరిశీలిస్తున్న జడ్జి డి. సత్యవతి

ముద్దాయిలు సత్ ప్రవర్తనతో మెలగాలి

తణుకు రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ముద్దాయిలు సత్‌ప్రవర్తనతో మెలగాలని, నేర ప్రవృత్తి విడనాడి కష్టపడి పని చేసుకోవాలని నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. శనివారం తణుకులోని సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా రిమాండ్‌లో వున్న ముద్దాయిల గురించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా వుంటూ సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని కోరారు. ఈ సందర్భంగా జైలు రిమాండ్ ముద్దాయిలుగా వున్న వారికి న్యాయ సహాయం అందుతుందా? అని ఆరా తీశారు. ముద్దాయిలకు జీవో 198 గురించి వివరించారు. న్యాయవాదిని పెట్టుకోలేని వారు మండల న్యాయ సేవల కమిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని చెప్పారు.

స్మార్ట్‌మీటర్లు బద్దలు కొట్టండి: సీపీఎం

తాడేపల్లిగూడెం, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీరటు్ల బిగిస్తే బద్దలు కొట్టాలని పట్టణ ప్రజలకు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అదాని స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించాలని భాగ్యలక్ష్మిపేట, సీతారాంపేట, నరసింహారావుపేట, నవ్వారుపేట ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు.







భీమవరంలో ప్లాస్టిక్ నిషేధంపై వీధి వ్యాపారికి అవగాహన కల్పిస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి, మొక్కలు నాటేందుకు మట్టి తీసుకువెళ్తున్న జిల్లా అదనపు ఎస్పీ భీమారావు.. తాడేపల్లిగూడెంలో స్వచ్ఛతా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్లాస్టిక్ రహిత జిల్లా కోసం నిరంతర కృషి: జేసీ

భీమవరం టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, నిరంతరం కృషి చేయడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో మావుళ్ళమ్మ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన సభకు జేసీ రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్లాస్టిక్ గ్లాసులు, బాటిల్స్ వాడకం చాలా ప్రమాదకరమని అన్నారు. ప్లాస్టిక్ బదులుగా గుడ్డ సంచులను పేపర్ కవర్లను వాడాల ని సూచించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం భీమవరం మావుళ్ళమ్మ గుడి సమీపంలో కొన్ని షాపులు, పండ్ల దుకాణాలను జాయింట్ కలెక్టర్ సందర్శించి షాపుల యజమానులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు గురించి వివరించారు.

తాడేపల్లిగూడెం రూరల్: ప్రతి వ్యక్తి స్వచ్ఛాంధ్ర సాధన లక్ష్యంగా ప్రతినెల 3వ శనివారం ప్రభుత్వ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ పేర్కొన్నారు. జగన్నాథపురంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక ఆధ్వర్యంలో నిర్వహించారు. జడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కల నివారణకు మందు స్ప్రే చేయించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీవో ఎం వెంకటేష్ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని కమిషనర్ అంజయ్య అన్నారు. శనివారం మునిసిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్రపై ప్రదర్శన చేశారు. ఈప్రదర్శనలో మునిసిపల్ ఉద్యోగులు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు. సెంటర్‌లో కమిషనర్ మాట్లాడుతూ ఇంటిని ఏవిధంగా శుభ్రంగా ఉంచుకుంటామో.. అదే రీతిలో పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

పాలకోడేరు: వేండ్ర పాఠశాల విద్యార్థులు ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జీవీవీ శ్రీనివాస్ ప్లాస్టిక్ రహిత సమాజం, తద్వారా ఆహ్లాదభరిత సమాజ సాధన కోసం చేయి చేయి కలుపుదాం.. ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం అనే నినాదాన్ని విద్యార్థులతో చేయించారు. పాఠశాల తెలుగు పంపన సాయిబాబు గ్రీన్ కోర్ అవార్డు గ్రహీత కవిత ద్వారా ఎండింగ్ ఆఫ్ ప్లాస్టిక్‌పై అవగాహన కలిగించారు.

ఆచంట: ఆచంటలో ఎంపీడీవో కృష్ణకుమార్ గ్రామాలను పరిశుభ్రంగా ఎలా ఉంచాలి.. చెత్త సేకరణ ఎలా నిర్వహించాలి అనే వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నాగబాబు పాల్గొన్నారు. అలాగే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని సబ్ రిజిస్ట్రార్ కె. వెంకటపతిరాజు నిర్వహించారు.

గణపవరం: గణపవరంలో పరిసరాల పరిశుభ్రతకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు నడుంబిగించాల్సిన అవసరం ఎంతైన ఉందని ఈఓపీఆర్‌డీ పల్లా సత్యనారాయణ అన్నారు. గణపవరంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. సర్పంచ్ మూరా అలంకారం, వైద్యాధికారి ఓంకార్‌నాథ్, ఎంపీహెచ్ఓ విల్సన్‌బాబు, జనసేన మండల అధ్యక్షుడు శ్రీనివాస రావు, పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు కోరారు. పట్టణంలో విద్యార్థులతో కలిసి అధికారులు భారీ ర్యాలీ నిర్వహించారు. పోలీస్ ఐలాండ్ వద్ద ప్లాస్టిక్ వినియోగం వల్లే కలిగే నష్టాలను తెలియజేసే స్టాల్స్‌ను ఆయన ప్రారంభించారు.

భీమవరం క్రైం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం జిల్లా అదనపు ఎస్పీ భీమారావు ప్రారంభించారు. ప్రతినెలా మూడవ శనివారం కార్యాలయ ఆవరణలో పరిశుభ్రత నెలకొల్పే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. స్వయంగా ఆయన గుంతను పూడ్చి చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎంవీవీ సత్యనారాయణ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పుల్లారావు పాల్గొన్నారు.

యూనిఫాంలు అందజేత

పాలకొల్లు అర్బన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఛాంబర్స్ జూనియర్ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు పట్టణంలోని పలు సత్రాల యాజమాన్యాలు యూనిఫాంలు అందజేశాయి. శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో రేపాక వారిసత్రం తరపున చైర్మన్ రేపాక శ్రీనివాసరావు 100 మందికి, అత్యం సుబ్బయ్యగారి అన్న సత్రం తరపున చైర్మన్ సుబ్రహ్మణ్యం కుమారుడు వంశీ 100 మందికి, మన్యం జగ్గమ్మ సత్రం తరపున జగ్గమ్మగారి మనుమడు అద్దేపల్లి మోహన్ దాసు 100 మందికి, శ్రీ క్షీరపురి అన్నదాన సమాజం తరఫున తెలనాకుల కోటేశ్వరరావు 120 మందికి యూనిఫాంలు అందజేశారు.

వైద్య శిబిరం వాయిదా

పెనుగొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం సహాయ పరికరాలు గుర్తింపు శిబిరం ఈ నెల 21వ తేదీన పెనుగొండ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించతలపెట్టిన శిబిరాన్ని వాయిదా వేయడం జరిగిందని ఎంపీడీవో సూర్యనారాయణ మూర్తి తెలిపారు. తదుపరి తేదీ తెలియజేస్తామని తెలిపారు.

సార్వాలో సాగునీటి ఇబ్బందులు

భీమవరం టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చాలా మండలాల్లో సార్వా పనులకు నీరులేక రైతాంగం తీవ్ర ఇబ్బదులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ ఆవేదన వ్యక్తం చేశారు. యలమంచిలి మండలంలో సాగునీరు కొరతతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆచంట, పోడూరు,పెనుమంత్ర, వీరవాసరం మండలాల్లో నారుమడులు బీటలు తీశాయని తెలిపారు. ఇది పూర్తిగా ప్రభుత్వం వైఫల్యమే తప్ప మరొకటి కాదన్నారు.

నేడు ఆరోగ్యంపై అవగాహన శిబిరం

పాలకోడేరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వాకర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో పాలకోడేరు శివారు పెదలోగిల్లు గోస్తనీ నది గుడి వద్ద ఈ నెల 20వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి ఉచిత హెల్త్ అవేర్‌నెస్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు గాదిరాజు కృష్ణంరాజు (హేచరీ బాబు) ఒక ప్రకటనలో తెలిపారు.

హైస్కూల్‌కు ఫర్నిచర్ అందజేత


గణపవరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని సర్పంచ్ కురేళ్ల వెంకటరత్నం అన్నారు. శనివారం జల్లికొమ్మర జడ్పీహైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన దాతలు ముఖమట్ల సీతారాముడు, కురేళ్ల సత్తిరాజు రూ.50వేలు విలువ గల ఫర్నిచర్‌ను హైస్కూల్ హెచ్‌ఎం పుప్పాల ప్రకాశరావుకు అందించారు.



చెత్త సేకరణకు ఆటోలు అందించిన ఎస్ఆర్‌కెఆర్ కళాశాల యాజమాన్యం.. చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్యే

చెత్త తరలింపు ఆటోలు అందజేత

భీమవరం రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపకులు, దివంగత సాగి రామకృష్ణంరాజు 92వ జయంతిని పురస్కరించుకుని కళాశాల యాజమాన్యం చిన అమిరం గ్రామ పంచాయతీకి చెత్త సేకరణకుగాను రెండు ఆటోలను అందించింది. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్యఅతిథులుగా హాజరై రామకృష్ణంరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల సెక్రటరీ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ, ఎంపీడీవో ఎం.గంగాధరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ నాగరాణి ప్రారంభించారు. కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పితానిని కలిసిన జనసేన నాయకులు

పెనుగొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అమెరికా నుంచి తిరిగి వచ్చిన ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను శనివారం ఆయన నివాసంలో పెనుగొండ మండల జనసేన నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో పెనుగొండ జనసేన టౌన్ అధ్యక్షుడు గుర్రాల సూరిబాబు, నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ గిరి నాగరాజు, కూనపరెడ్డి సుధాకర్‌రాజు ఉన్నారు.


పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలి

ఆకివీడు రూరల్ జూలై 19(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఎంఈవో రవీంద్ర అన్నారు. అయిభీమవరంలోని జడ్పీపాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు. హ్యాండ్‌బుక్స్‌తో బోధన చెయ్యాలని అన్నారు. క్లస్టర్ ఛైర్‌పర్సన్ అనురాధ, సెక్రటరీ నారాయణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన మావుళ్ళమ్మ కమిటీ సభ్యులు

భీమవరం టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మావుళ్ళమ్మ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నూతనంగా నియమితులైన శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యే అంజిబాబును కలిశారు. పాలకవర్గ సభ్యులు రామాయణం శ్రీనివాస్, వీరమల్లు శ్రీనివాస్, గుసిడి సూరిబాబు, మీనాక్షి తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.



కాంట్రాక్టర్ నిర్వాకం

పంచాయతీ ట్రాక్టర్ వినియోగం

పాలకోడేరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలో చెత్తను తరలించే ట్రాక్టర్‌ను ఓ కాంట్రాక్టర్ తన సొంత పనులకే వినియోగించుకుంటున్న పరిస్థితి వేండ్ర పంచాయతీలో శనివారం చోటు చేసుకున్నది. వేండ్ర గ్రామ పంచాయతీ పరిధిలో ఓ కాంట్రాక్టర్ గ్రామంలో సీసీ రహదారులను నిర్మిస్తున్నాడు. దీనికి కావలసిన మెటల్, ఇసుకను గ్రామ శివారులోని డంపింగ్ యార్డు సమీపంలో నిల్వ ఉంచుకున్నాడు. ఈ రహదారిని నిర్మించేందుకు నిల్వ ఉంచుకున్న ఇసుకను, కంకర (మెటల్) తదితర వస్తువులను తరలించడానికి ఏకంగా పంచాయతీకి చెందిన పారిశుధ్య వాహనాన్ని ఆయన సొంత పనుల కోసం వాడుకోవడంతో గ్రామస్థులు ఫొటోలు తీసి 'ఆంధ్రజ్యోతి'కి అందించారు. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా గ్రామ పంచాయతీకి చెందిన పనులే కాబట్టి కాంట్రాక్టర్ ఆయిల్ కొట్టించుకుని కంకర, ఇసుక చేరవేసుకుంటామంటేనే తాము ట్రాక్టర్ ఇచ్చామని బదులిచ్చారు.